ఉసూరుమని పింఛెన్

- ఏడాదిన్నరగా ఓపెన్ అవ్వని సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- గత ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియగా పింఛన్ల మంజూరు



గ్రామ సచివాలయం

వీరవాసరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్లకు మాత్రం మోక్షం లభించలేదు. గత ప్రభుత్వం త్వరితగతిన పింఛన్లు మంజూరు చేసిందని పలువురు చెబుతున్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో అర్హులు సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధాప్య, వితంతు పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు ఆయా గ్రామాల్లో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని అధికారుల తేలిచ్చి చెప్పడంతో నిరుత్సాహంతో వెనుతిరుగుతున్నారు. పైగా ఉన్న పింఛన్లు తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక...

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబర్ నెలలో కొత్త జీవో తీసుకొచ్చింది. పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే, మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. నెలలో 15నుంచి 31వ తేదీలో చనిపోతే నెల విడిచి మరోనెలలో పింఛన్ అందజేయాలని స్పష్టం చేశారు. అయితే పింఛన్ రాని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినా, ప్రమాదంలో మృతి చెందినా అలాంటి వారి భార్యలకు పింఛన్ అందజేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఏడాదిగా నూతన పింఛన్లు రాకపోవడంతో వీరవాసరం, భీమవరం రూరల్ మండలంలో 60సంవత్సరాలు నిండిన సుమారు 2,500మందికి పైగా లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురు చేస్తున్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి జన్మభూమి కార్యక్రమం నిర్వహించి నూతన పింఛన్లు అందజేస్తామని గత డిసెంబర్‌లో ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి నూతన పింఛన్లు అందుతాయని ఎదురుచూసిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎదురు చూపులే మిగిలాయి.

50ఏళ్ల హామీ ఎన్నడో..?

ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు చెందినవారికి 50సంవత్సరాలు పూర్తయిన వెంటనే పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. దీంతో మండలంలో సుమారు 6వేల మందికి పైగా 50 సంవత్సరాలు నిండిన వారు ప్రభుత్వ హామీ ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛను దరఖాస్తులు స్వీకరించేటప్పుడు 50సంవత్సరాలు నిండిన వారి దరఖాస్తులు కూడా తీసుకోవాలని కోరుతున్నారు.

50ఏళ్లకు పింఛన్ అందజేయాలి

కూటమి ప్రభుత్వంలో చేతి వృత్తుల వారికి ఎటువంటి పథకాలు అందడం లేదు. ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా వెనుకబడిన తరగతుల వారికి 50ఏళ్లకు పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు చెందిన 50ఏళ్లు నిండినవారికి వెంటనే పింఛన్లు అందజేయాలి.

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తులు తీసుకోవడం, వెంటనే మంజూరు చేయడం వంటి ప్రక్రియ కొనసాగిస్తే, కూటమి పాలనలో దానికి భిన్నంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. మొదటి మూడు సంవత్సరాల పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున నూతన పింఛన్లు అందజేసేది. ఆ తర్వాత 2023, 2024 సంవత్సరాల్లో ప్రతి ఆరు నెలలకు అర్హులైన వారు నష్టపోకుండా వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి పింఛన్లు అందజేసింది. 2024 జనవరిలో వైఎస్సార్ సీపీ హయాంలో చివరిగా నూతన పింఛన్లు అందజేశారు. తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో నూతన పింఛన్లకు బ్రేక్ పడింది. అవిధంగా 2024 ఏప్రిల్ నెలలో ఆగిపోయిన సైట్ నేటికీ కూడా ప్రారంభం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 15నెలలు పూర్తయినా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హుల్లో ఆందోళన నెలకొంది.

దరఖాస్తులు స్వీకరించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 15నెలలు పూర్తయినా నేటికీ నూతన పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరించకపోవడం దారుణం. అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 50ఏళ్లకు పింఛన్ అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి.

కటకం సుబ్రమణ్యం,రాయకుదురు

అర్హులకు అందజేయాలి



అర్హులందరికీ ప్రభుత్వం నూతన పింఛన్లు అందజేయాలి. వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం అందజేసే పింఛనే ఆధారం. పింఛన్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. కనీసం ఆరునెలలకు ఒక్కసారైనా నూతన పింఛన్లు అందజేయాలి.అర్హులైన లబ్ధిదారులను గుర్తించి తక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

సీహెచ్ఎస్ఎస్ మూర్తి, తోలేరు

ఆదేశాలు వస్తే అందజేస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం పింఛను అందుకుంటున్న, భర్తచనిపోయిన భార్యలకు నూతన పింఛన్లు అందజేస్తున్నారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పింఛన్లు అందజేయడం జరుగుతుంది.

బీవీవీ అప్పారావు,
సూపరింటెండెంట్, వీరవాసరం

మర్యాదపూర్వక కలయిక


శాసన మండల చైర్మన్ కొయ్యే మోషేన్ రాజును కలిసిన ఉమాశంకర్, తదితరులు

వీరవాసరం: శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజును ఆదివారం వారి స్వగృహంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శి ఉమాశంకర రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేడద జాన్సన్, మానుకొండ ప్రదీప్ కుమార్, కామన నాగేశ్వరరావు, నాగరాజు అరవింద్ వర్మ ,కర్రి రవికుమార్, డివిడి ప్రసాద్, కోడె యుగంధర్, గాదిరాజు రామరాజు, సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శలు


రాంబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కవురు శ్రీనివాస్

వీరవాసరం: మండలం చింతలకోటి గరువు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సొసైటీ చైర్మన్ కటికిరెడ్డి రాంబాబు భార్య సూర్యకుమారి మరణించడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ, రాష్ట్ర శెట్టిబలిజ విభాగ అధ్యక్షుడు కవురు శ్రీనివాస్ ఆదివారం వారి స్వగృహానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట దాసరి మాణిక్యాలరావు, కె.శ్రీనివాస్, కె. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి శ్రీవారి ఆలయంలో దసరా ఉత్సవాలు

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ తేదీ సోమవారం నుంచి దసరా శరన్నవరాత్రుల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ ఆదివారం తెలిపారు. దేవస్థానంలో 9రోజుల పాటు శ్రీలక్ష్మి అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

షార్ట్ ఫిల్మ్ బృందానికి అభినందనలు

కాళ్ల: ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ ఐక్య నేషనల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ చిత్రీకరించిన ×నీకోసం షార్ట్ ఫిల్మ్ బృందాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారు. పెదఅమీరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం చిత్ర బృందం కలిసి ఫిల్మ్ చూపారు. ఫౌండేషన్ అధ్యక్షుడు శివరామరాజు, వైఎస్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్త దానం ద్వారా ముగ్గురి వరకు ప్రాణాలను కాపాడే అవకాశముందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి పూరి గుడి వద్ద ఆదివారం జైన్ సమాజ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు, శస్త్రచికిత్సల సమయంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రక్తహీనతతో బాధపడేవారికి రక్తం ఎంతో అత్యవసరమని, రక్తదానం ద్వారా కొత్త జీవితాన్ని అందించవచ్చునని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. వీరికి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏపీఐఐసి డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్, జైన్ సభ్యులు అల్లు శ్రీనివాస్, సోహన్ రాజ్ జైన్, రమేష్ అగర్వాల్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ శివ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ఉండి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో పాల్గొని అవకాశాన్ని మరింత మందికి కల్పిద్దామని క్లబ్ జోన్ చైర్మన్ రావూరి నాగరాజు అన్నారు. ఆదివారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో జోన్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్లబ్‌లో మరింత మందికి సభ్యత్వం కల్పించి వారికి కూడా సేవ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ జిల్లా గవర్నర్ ఇచ్చిన సభ్యత్వాల టార్గెట్ సాధించినట్లు తెలిపారు. తన పరిధిలో పనిచేస్తున్న గణపవరం, ఉండి, చేబ్రోలు క్లబ్‌లు ఎంతో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు రంగరాజు, గణపవరం క్లబ్ కోశాధికారి మూర్తి, ఉండి క్లబ్ కార్యదర్శి రంగప్రసాదరాజు, డీసీ మెంబర్ కన్నెగంటి రూత్‌కళ, సత్తి బ్రహ్మారెడ్డి, కాగిత మహంకాళి,కలిదిండి సీతారామరాజు, బీ హరనాధరాజు, పాలతీర్థపు నర్సింగరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు ప్రారంభం

భీమవరం: బాడీ బిల్డింగ్ అంటే కండల ప్రదర్శన కాదని, ఫిట్నెస్ ప్రక్రియ అని, చురుగ్గా ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం కష్ణదేవరాయ కల్యాణ మండలంలో ఆదివారం మిస్టర్ ఆంధ్ర ఓపెన్ స్టేట్ లెవెల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలను విజేతలకు ట్రోఫీతో పాటు మూడు మోటార్ సైకిల్స్, టీవీలను అందించడం గొప్ప విశేషమని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కాసిం, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, సతివాడ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు కోడి పందేలపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొవ్వాడ పుంతలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు వారి వద్ద నుంచి కోడి పుంజు, రెండు కోడి కత్తులు, రూ. 520 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఈతకోట శ్రీనివాసరావు తెలిపారు.

అంతుచిక్కని వాతావ'రణం'


ఆకివీడులో వర్షం కురుస్తున్న దృశ్యం

ఆకివీడు: గత కొన్ని రోజులుగా వాతావరణం అంతుచిక్కడంలేదు. ఆదివారం పగలంతా గ్రీష్మతాపానికి ప్రజలు అల్లాడిపోతుంటే, సాయంత్రం పడిన తుంపర్ల వర్షం కురిసింది. కొద్దిసేపు ఊపిరి పీల్చుకున్నా, ఉక్కబోత వాతావరణం తప్పడం లేదు. వర్షాకాలం అయినప్పటికీ ఆకివీడు ప్రాంతంలో దుక్కి వర్షం కురిసిన దాఖలాలు లేవు. చిరు జల్లులు, ఈదురుగాలులతో పాటు ఆకాశం మేఘావృత్తమై నిట్టూర్పులతో చెక్కేస్తుంది. పగలంతా ఉక్కబోత వాతావరణం, సాయంత్రానికి చల్లబడి, చిరుజల్లులు పడినప్పటికీ ఉక్కబోత వాతావరణం తప్పడంలేదు. దీంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతోన్నారు. పగలు 30 నుంచి 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతున్నప్పటికీ 35 నుంచి 40 డిగ్రీలను తలపించే విధంగా ఎండలు కాస్తున్నాయి. దీంతో వృద్ధులు, పిల్లలే కాదు, జనమంతా వాతావరణాన్నికి అల్లాడిపోతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పోతున్నారు. దీనికి తోడు అప్పుడప్పుడూ కరెంట్ కోతలతో మరింత ఉక్కిరి బిక్కిరవుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులకు ఇటు ప్రజలతో పాటు అటు చెరువుల్లోని రొయ్యలు, చేపలకు ఆక్సిజన్ అందక వ్యాధులబారిన పడుతున్నాయి. వందలాది ఎకరాల చెరువుల్లోని రొయ్యలు 300 పైబడి కౌంట్‌లో చనిపోతున్నాయి. చెరువుల్లో వదిలిన 15, 20 రోజులకే చనిపోవడంతో రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు.

ఉండిలో భారీ వర్షం


ఎన్నార్పీ అగ్రహారంలో మునిగిన రోడ్లు

ఉండి: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం మండలాన్ని ముంచెత్తింది. వర్షానికి తోడు భీకరమైన ఉరుములు, మెరుపులు, గాలులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీనికి తోడు వర్షం ప్రారంభమైన కొద్దిసేపటికే విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు చీకటిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. భారీ వర్షంతో మెట్టప్రాంతాల్లోని రోడ్లు కూడా జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని సీసీరోడ్లు కాలువలను తలపించాయి. భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది.

నేటి శరన్నవరాత్రుల మహోత్సవాలు

- ముస్తాబైన అమ్మవార్ల ఆలయాలు
- ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు


విశేష అలంకరణలో మావుళ్లమ్మ అమ్మవారు


పంచారామక్షేత్రంలో పార్వతీదేవి అమ్మవారు


వాసవి కన్యకపరమేశ్వరీ అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రమైన భీమవరంలో దేవిశరన్నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి వచ్చే నెల 2 తేదీ వరకు 11 రోజుల పాటు పట్టణంలో దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు అమ్మవారి ఆలయాల వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ, క్యూలైన్లు ఏర్పాట్లు తదితర దసరా ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, ఫైర్, విద్యుత్, ఆరోగ్య, తదితర శాఖలతో దేవదాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పక్కా ఏర్పాట్లుతో ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో: భీమవరం పట్టణ ఇలవేల్పు, రాష్ట్రంలోనే ప్రముఖ దేవస్థానంగా ఉన్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో 22 తేదీ నుంచి దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం మావుళ్లమ్మ అమ్మవారు శ్రీస్వర్ణ రజత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 23 తేదీన బాలాత్రిపుర సుందరీదేవి, 24న గాయత్రి దేవి, 25న అన్నపూర్ణ దేవిగా, 26న మహలక్ష్మీ దేవిగా, 27న శ్రీలలితాత్రిపుర సుందరీ దేవి, 28న శ్రీమహచండీ, 29న సరస్వతి దేవి, 30న దుర్గాదేవిగా, 1 తేదీ శ్రీమహిషాసురమర్ధనీగా, 2న రాజరాజేశ్వరీదేవిగా ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అలాగే పట్టణంలోని పంచారామక్షేత్రం, భీమేశ్వర స్వామి దేవస్థానంలో, వాసవికన్యకపరమేశ్వరీ ఆలయంలో దేవి నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఘనంగా దసరా శోభాయాత్ర


దసరా శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు ప్రారంభం సందర్భంగా సాంప్రదాయబద్ధంగా ఆదివారం మావుళ్లమ్మ శోభాయాత్ర నిర్వహించారు. మావుళ్లమ్మ ఆలయం నుంచి మహిళలు కలశాలతో పూరి గుడి, భీమేశ్వర స్వామి దేవస్థానం, పొట్టి శ్రీరాములు, తహసీల్దార్ కార్యాలయం మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

నిధులున్నా... రోడ్ల పనులు సున్నా

- రూ. 53 కోట్ల మేర సీఆర్ఎఫ్ నిధులు మంజూరు
- నిర్మించిన రిటర్నింగ్ వాల్‌కు రూ. 15 కోట్లు పెండింగ్
- పెదకాపవరం రోడ్ల నిర్మాణానికి మూడేళ్లు కావస్తున్నా మోక్షం లేదు
- లబోదిబోమంటున్న ప్రజలు, ప్రయాణికులు, రైతులు


ఆకివీడు: పెదకాపవరం శివారు గణపవరం రోడ్డు దుస్థితి


కేజీ రోడ్డులో క్రొవ్విడి రోడ్డు దుస్థితి


పాములపర్రు-కొల్లేరు రోడ్డులో భారీ గుంతలున్న దృశ్యం


పాములపర్రు-పెదకాపవరం రోడ్డులో ప్రమాదభరితంగా ఊసలు కన్పిస్తున్న వంతెన

ఆకివీడు: రోడ్ల నిర్మాణానికి సెంట్రల్ రోడ్డు ఫండ్(సీఆర్ఎఫ్) నిధులు గత ప్రభుత్వంలో పుష్కలంగా మంజూరు అయినా ఆయా రోడ్లకు మోక్షం లభించడంలేదు. కలవపూడి-గణపవరం (కేజీ రహదారి) రోడ్డు, పెదకాపవరం-కొల్లేరు రోడ్లు అభివృద్ధికి, విస్తరణకు గత ప్రభుత్వంలో కేంద్ర నిధులు రూ. 53 కోట్ల మేర విడుదలయ్యాయి. రెండు రోడ్లకు భూమి పూజ చేసి నిర్మాణ పనులు చేపట్టారు. ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామం నుంచి క్రొవ్విడి వరకూ పంట కాల్వకు రిటర్నింగ్ వాల్ యుద్ధప్రాతిపదికన నిర్మించారు. సుమారు రూ. 15 కోట్ల వ్యయమైంది. ఇంత వరకూ సంబంధిత కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి బిల్లు చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా పాములపర్రు-పెదకాపవరం-కొల్లేరు రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు ఆక్రమణల పనులు చేపట్టినప్పటికీ రోడు విస్తరణ పనులు చేపట్టలేదు.

నరకం చూస్తున్నారు

కేజీ రహదారిలో క్రొవ్విడి వెళ్లే మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. రోడ్డుకు చేర్చి చెరువులు తవ్వివేయడంతో చెరువు ఊట నీరు రోడ్డులోకి వచ్చి, భారీ వాహనాలు దిగిపోతున్నాయి. వేసవిని తలపించే ఎండలు కాస్తున్నా ఈ ప్రాంతంలో రోడ్డు బురదమయంగానే ఉంది. ఆకివీడు నుంచి గణపవరం వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఈ రోడ్డు ఉంది. ద్విచక్ర వాహనాలపై కూడా ప్రయాణించలేని దుస్థితిలో రోడ్డు ఉంది. ఉండి-గణపవరం రోడ్డు కూడా గతుకులతో ఉండటంతో ఈ ప్రాంత ప్రయాణీకులు, వ్యాపారులు పెదకాపవరం రోడ్డును ఆశ్రయిస్తున్నారు. వాహనాలు దిగిపోయి, గంటల తరబడి నెట్టుకుని, మరొక వాహనాన్ని తీసుకువచ్చి బయటకు లాగించాల్సి వస్తుంది. చేపలు, రొయ్య చెరువుల మేత, పట్టుబడులు, ఇతరత్రా అవసరమయ్యే వాటిని తీసుకువెళ్లేందుకు ఈ రోడ్డులో లారీలు, మినీలారీలు, ఆటోలు, ఐసర్ వంటి వాహనాలు అధికంగా నడుస్తున్నాయి.

కొల్లేరు రోడ్డు అదే పరిస్థితి

పాములపర్రు నుంచి పెదకాపవరం గ్రామం మీదుగా గంటలరాయుడు పేట. కొల్లేరు వెళ్లేందుకు వాహనచోదకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. రోడ్డు విస్తరణకు యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగించినా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో పలు చోట్ల గుంతలు, గుంతలుగా మారింది. చేపలు, రొయ్యల చెరువులకు వెళ్లే వాహనదారులు, లారీలు, ఇతర వాహనాలు ప్రమాదభరితంగా ప్రయాణం చేస్తున్నాయి.

కూలడానికి సిద్ధంగా వంతెన

పాములపర్రు-కొల్లేరు రోడ్డులో పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. పాములపర్రు వద్ద వెంకయ్య వయ్యేరు పంట కాల్వపై ఉన్న వంతెన పూర్తిగా ధ్వంసమైంది. ఇటీవల ఉండిలో ఫ్లైవోవర్ నిర్మాణంతో బస్సులు, ఇతర వాహనాలను పాములపర్రు మీదుగా పెదకాపవరం-ఆకివీడు మీదుగా వస్తుండటంతో ఈ రహదారి మరీ అధ్వానమైంది. దుక్కి వర్షానికే రోడ్లు ముంపుకు గురవుతున్నాయి.

బిల్లులు చెల్లించాలి

రోడ్లు, రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేసి రూ. 15 కోట్ల మేర బిల్లులు పెట్టినప్పటికీ, చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడనే స్తంభించిపోయాయి. ఒకేసారి 50 కోట్లకు పైగా నిధులు మంజూరు అయినప్పటికీ ప్రజలకు అవస్థలు తప్పడంలేదని వాపోతున్నారు. పనులు ప్రారంభించడంతో నిధులు మురిగిపోకుండా ఉన్నాయి. అయితే ఆ నిధుల్ని ఇతరత్రా పనులకు మళ్లించి ఉంటారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిధులు పుష్కలంగా ఉన్న ఈ రెండు రోడ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

దగ్గరి మార్గాన్ని కోల్పోతున్నాం



పెదకాపవరం నుంచి గణపవరం, ద్వారకా తిరుమల, తాడేపల్లిగూడెం, జాతీయరహదారి ప్రాంతానికి వెళ్లేందుకు దగ్గర మార్గాన్ని కోల్పోతున్నాము. కేజీ రహదారి, కొల్లేరు రహదారుల్ని వెంటనే నిర్మించాలి. కొల్లేరు ప్రాంతానికి వెళ్లేందుకు వాహనదారులు నిరాకరించే పరిస్థితి వస్తుంది. రోడ్ల నిర్మాణం స్తంభించడంతో రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

-కట్టెడ్డి నాగ మోహనరావు,
రైతు, పెదకాపవరం, ఆకివీడు మండలం